

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :157 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 09-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

సీఎం కాగానే నాపై స్టింగ్ ఆపరేషన్.. డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు..!



బెంగళూర్ : ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే తనపై స్టింగ్ ఆపరేషన్ జరిగిందని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు కుట్ర జరిగిందని అన్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు , పత్రాలు తన వద్ద ఉన్నాయని, ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని చెప్పారు.ఢిల్లీలో ఇవాళ (గురువారం) మీడియాతో మాట్లాడిన శివకుమార్.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. తనను ఇరికించేందుకు ప్రయత్నం చేశారని, తన వద్ద ఫొటోలు ఉన్నాయని చెప్పారు. ఈ వ్యవహారంపై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు శివకుమార్ వెల్లడించారు. తనను కలిసిన వ్యక్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను భద్రపరిచినట్లు తెలిపారు.అయితే ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే బయటపెట్టలేనని డీకే అన్నారు. 'వాళ్లు ఏం మాట్లాడేందుకు వచ్చారు..? ఎలా వచ్చారు..? ఎవరిని కలిశారు..? అనే విషయాలు అన్నీ తనకు తెలుసని చెప్పారు. దీని వెనుక ఎవరు ఉన్నారో కూడా తెలుసని అన్నారు. ప్రభుత్వ అధికారులను కూడా ఇలాంటి ఉచ్చుల్లోకి లాగవచ్చని హెచ్చరించిన ఆయన.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తన చుట్టూ మూడు స్థాయుల్లో వ్యక్తులు ఉంటారని, కొందరిని ప్రత్యేకంగా నియమించినట్లు తనకు సమాచారం ఉందని ఆరోపించారు. తనపైనే కాకుండా మరికొందరిపైనా స్టింగ్ ఆపరేషన్లు జరుగుతున్నాయని శివకుమార్ ఆరోపించారు. వాటి వెనుక ఎవరు ఉన్నారు..? వాటికి నిధులు ఎవరు సమకూరుస్తున్నారు..? అన్న సమాచారం తన వద్ద ఉందని చెప్పారు. తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని స్పష్టంచేశారు.

క్యాన్సర్ పేషంట్లకు సపై ఆగిపోయిన దౌర్భాగ్యమైన పరిస్థితి



హైదరాబాద్, MNJ క్యాన్సర్ ఆసుపత్రికి సప్లయర్లు సప్లై ఆపేశారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీచీజీ క్యాన్సర్ ఆసుపత్రి తెలంగాణలోనే అతి పెద్ద గవర్నమెంట్ క్యాన్సర్ ఆసుపత్రి కేసీఆర్ హయాంలో వీచీజీ ఆసుపత్రికి ఒక సూపర్ స్పెషలిటీ హాస్పిటల్‌లో ఉండాల్సిన అన్ని ఎక్విప్ మెంట్స్ పెట్టారు.కేసీఆర్ ఒక బ్రహ్మాండమైన ఏ కార్పొరేట్ ఆస్పత్రినైనా తలదన్నే విధంగా ఎక్విప్‌మెంట్స్ తీసుకొచ్చి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి పెడితే ఇవాళ పరిస్థితిచూడండి. క్యాన్సర్ పేషంట్లకు సప్లైలు ఆగిపోయిన దౌర్భాగ్యమైన పరిస్థితి రాష్ట్రంలో వచ్చిందంటే ఒకసారి ఈ రాష్ట్రం ఆలోచన విధానం, ఈ రాష్ట్రం బుద్ధి.. ఇవాళ ఉన్న ప్రభుత్వ నాయకుల బుద్ధి ప్రజలు అర్థం చేసుకోవాలి.. వీళ్లు ఇప్పటివరకు ఏ పని కూడా మానవీయ కోణంతో చేయరు.ఉన్నవాళ్లను చంపుతున్నరు.. ఉన్నవాళ్ల ఆరోగ్య పరిస్థితి దారుణంగా ఉంటే ఫ్యూచర్ సిటీ (భవిష్యత్ సిటీ)కి రూ.50 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. అక్కడ ఒక్క మనిషి లేని చోట్ల కొత్తకొత్త ఎనిమిది లైన్ల రోడ్లు వేశారు. మా విద్యార్థులు విద్యకు నోచుకోకుండా ఉన్నారు..మా పేషంట్ల పరిస్థితి ఇంత దారుణంగా ఉంది.. దీని మీద ఎంత అవుతది ఖర్చు. మీరు రోజూ హెలికాప్టర్‌లో తిరుగుతున్న ఖర్చు కంటే తక్కువ ఖర్చు మా అన్ని ఆస్పత్రులకు, మా మెడికల్ కాలేజీలకు సరిపోతది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మీరు హెలికాప్టర్ తిరిగితే అయ్యే అంత ఖర్చు కూడా కాదు తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రులు మెయింటైన్ చేయడానికి.. మీ ప్రాధాన్యతలేంటి అసలు అని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రశ్నించారు.

జూరాల రైతులపై కేసులా..? కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఫైర్



జడ్చర్ల: జూరాల ఆయకట్టు రైతులపై కేసులు నమోదు చేయడాన్ని మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా. సి. లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. జూరాల డ్యాం వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణమని విమర్శించారు. కృష్ణా జలాలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. పంటలు ఎండిపోతుంటే చూడలేక రైతులు ఆందోళన బాట పట్టారని లక్ష్మారెడ్డి అన్నారు. ఆవేదనతో రైతులు ధర్నా చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాదని, ప్రజలను పీడించే పాలనగా మారిందని విమర్శించారు.రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కేసులు నమోదు చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన, రైతులతో కలిసి పోరాటం చేపడతామని హెచ్చరించారు. ముందుగా రైతులకు సాగునీరు అందించే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు భేటీ



ఢిల్లీ, అక్టోబర్ 8: పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతిని, ఇటీవల రూ.30 వేల కోట్లతో చేపట్టిన జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పనుల వివరాలను కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సీఆర్ పాటిల్ తో భేటీ అయ్యారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో సుదీర్ఘంగా పెండింగులో ఉన్న పలు అంశాలను పరిష్కరించాలని సీఎం కోరారు.ఆ రెండు రాష్ట్రాల్లో పోలవరం నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన ప్రొటెక్టివ్ ఎంబాంక్‌మెంట్స్ పనులకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందనే కారణంతో అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన స్టాప్ వర్క్ ఆర్డర్ ప్రస్తుతం అబెయన్సులో ఉన్నప్పటికీ... దాన్ని శాశ్వతంగా ఉపసంహరించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఒప్పించాలని కోరారు.

ఆత్మీయ ఆహ్వానం

సరికొత్త ఫ్యాషన్ ప్రపంచం ఇప్పుడు మన నల్గొండలో



తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు & సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు

శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి

చేతులమీదుగా

ఈరోజే
ఉ.10.30 ని.లకు

గొప్ప ప్రారంభం

ముఖ్య నేతలకు, జిల్లా అధికారులకు
కస్టమర్ దేవుళ్ళకు
ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం

చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తత...



హైదరాబాద్,లోక్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్ , దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్ లను అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులుహైదరాబాద్: ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో లోక్ భవన్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది.నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్ భవన్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం లోక్ భవన్ వద్ద నిరసనకు దిగిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయనే అనుమానాలు ప్రజల్లో నెలకొన్నాయని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని పేర్కొన్నారు.సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీలను అరెస్ట్ చేయడం పూర్తిగా అక్రమం, అప్రజాస్వామికం అని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు.ప్రజల ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఓటర్ల జాబితాలో అవకతవకలకు తావులేకుండా పారదర్శకమైన ప్రక్రియను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని మంత్రి స్పష్టం చేశారు.

పటేల్‌కు ఓట్లు పడితే నెహ్రూను ప్రధాని చేశారు.. ఓటు చోరీ కాంగ్రెస్‌దే

హైదరాబాద్, ఓటు, సీటు చోరీ పేటెంట్స్ కాంగ్రెస్ వేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు చేశారు. మొట్టమొదటి ఓటు, సీటు చోరీకి తెరలేపింది కాంగ్రెస్సేనని ఆయన వ్యాఖ్యానించారు. 1946లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బ్రిటీష్ పాలకులు కాంగ్రెస్ కోరిన సమయంలో దేశంలోని ప్రదేశ కాంగ్రెస్ కమిటీలన్నీ తొలి ప్రధాని అభ్యర్థిగా పటేల్ పేరు ప్రతిపాదిస్తూ ఓట్లేస్తే.. ఒక్క పీసీసీ మద్దతు కూడా లేని నెహ్రూను ప్రధాని చేసిన ఘనత కాంగ్రెస్ దేనని ఎద్దేవా చేశారు.

బండి సంజయ్ మాట్లాడుతూ.. మోడీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి హౌజింగ్ బోర్డు కాలనీ పదవ చౌరస్తా వరకు బుధవారం సేవా జ్యోతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రధాని మోడీకి కాంగ్రెస్ లా.. ఓటు, సీటు చోరీకి పాల్పడాల్సిన కర్మ లేనేలేదన్నారు.



అత్యద్భుత ప్రారంభోత్సవ ఆఫర్స్

అస్సలు మిస్సవ్వకండి

శారీస్ | ఉమెన్స్‌వేర్ | మెన్స్‌వేర్ | కిడ్స్‌వేర్



డి చెన్నయ్ షాపింగ్ మాల్

ఎన్.టి.ఆర్. విగ్రహం దగ్గర, హైదరాబాద్ రోడ్, నల్గొండ



సంపాదకీయం

శుక్రవారం 09-10-2026

పతకాలు చెప్పే పాఠం

నువ్వా నేనా అన్నట్టు తలపడే క్రీడోత్సవాల్లో కూడా యుద్ధంలో మాదిరే అవతలి పక్షంపై గెలిచి తీరాలన్న తపన, పట్టుదల ఉంటాయి. ఈర్ష్య, అహంకారం వంటివీ అప్పుడప్పుడు కనబడకపోవు. కానీ దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చెప్పినట్టు ప్రపంచాన్ని మార్చే శక్తి, కోట్లాదిమందికి ప్రేరణగా నిలిచే సామర్థ్యం, ప్రపంచ పౌరుల్ని ఒక్కటిచేసే సత్తా క్రీడలకే ఉంటుంది. జపాన్‌లోని నగోయాలో రెండు వారాలు కొనసాగి, ఎన్నో అద్భుతాలు ప్రపంచానికందించిన ఆసియా క్రీడల సంరంభం ఆదివారం ముగిసింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా క్రీడాకారుల తర్వాత పతక విజేతల్లో మన ఆటగాళ్లది నాలుగో స్థానం. 2023నాటి చైనా క్రీడోత్సవాల్లోనూ మన స్థానం అదే గనుక ఫర్వాలేదన్న అభిప్రాయం కలుగుతుంది. కానీ సంఖ్యరీత్యా ఈసారి తీసికట్టే. గతంలో 28 స్వర్ణపతకాలు గెలుచుకున్న మన దేశం ఇప్పుడు 21కి సరిపెట్టుకోవాల్సివచ్చింది. వెండి పతకాల్లో చూస్తే 38 నుంచి 28కి పడిపోయాం. కాంస్యంలోనూ అంతే. గతంలో వాటి సంఖ్య 41 కాగా ఇప్పుడు 37. షూటింగ్, ఆర్చెరీ, అథ్లెటిక్స్ విభాగాల్లో అనుకున్న స్థాయిలో స్వర్ణాలు గెలుచుకోలేకపోవటం పెద్ద లోటు. మనం నాలుగో స్థానంలో ఉన్నామన్న మాటేగానీ తొలి ముగ్గురితో పోలిస్తే చాలా దూరంలో ఉన్నట్టు లెక్క. ఉదాహరణకు 341 పతకాలతో చైనా, 269తో జపాన్, 150తో దక్షిణ కొరియా ఉన్నాయి. గతంలో 107 పతకాలు గెల్చుకున్న మన జట్లు ఇప్పుడు 85కి పరిమితమయ్యాయి.మన క్రీడాకారుల ఎంపిక ఈసారి కొంత కఠినంగానే ఉంది. పతకాలు రాబట్టగలిగేవారినే ఎంపిక చేయాలన్న పట్టుదల కనబడింది. అందుకు నిర్దేశించిన గీటురాళ్లు కూడా చిన్నవేం కాదు. గత క్రీడోత్సవాల్లో, ఆసియన్ చాంపియన్‌షిప్, అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఇతర టోర్నీల్లో తొలి ఆరుస్థానాల్లో నిలిచినవారినే జపాన్ పంపాలన్నది అందులో ముఖ్యమైనది. గతంలో 'సొంత ఖర్చులతో వస్తాం. అవకాశమీయండి' అని అడిగే క్రీడాకారులు... మన్నించిన అభ్యర్థనలూ తక్కువేం కాదు. ఈసారి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అలాంటివారికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటీయరాదన్న కృతనిశ్చయంతో ఉంది. మెరుగ్గా ఆడేవారికి మాత్రమే అవకాశం ఇవ్వాలన్న సంకల్పం మంచిదే. ఇందువల్ల వెళ్లిన క్రీడాకారుల సంఖ్య తగ్గింది. వారిలో ఎక్కువ శాతంమంది మెడల్ రౌండ్ వరకూ వెళ్లగలిగారు. ఎప్పట్లాగే ఇతర ఈవెంట్లతో పోలిస్తే మనకు అథ్లెటిక్స్‌లోనూ, షూటింగ్‌లోనూ ఎక్కువ పతకాలొచ్చాయి. వాటిల్లో కూడా సంఖ్యాపరంగా తగ్గినట్టే. ఆసియా క్రీడోత్సవాలను ఒలింపిక్స్‌కు ముందస్తు పరీక్షలుగా భావిస్తారు. అక్కడ పనితీరునిబట్టే ఒలింపిక్స్‌లో జాతకం ఎలా ఉండబోతోందో చెప్పవచ్చంటారు. చైనా క్రీడోత్సవాలకూ, జపాన్ ఉత్సవాలకూ మధ్య మన దేశం దాదాపు రూ. 98 కోట్లు వ్యయం చేసింది. కానీ సాధించింది చాలా తక్కువే. మనకొచ్చిన స్వర్ణాల్లో కూడా అత్యధికం...అంటే 21లో 13 టీమ్ ఈవెంట్స్‌కు సంబంధించినవే. సమష్టిగా, సమన్వయంతో ఆడి గెల్చుకోవటం ప్రశంసించదగ్గదే అయినా, ఒలింపిక్స్‌లో ఈ ఈవెంట్స్‌కు చోటుండదు. ఆటగాళ్ల పనితీరు మెరుగుపడిందా లేదా అన్నది చూడాలి తప్ప, పతకాలను చూసి అంచనాకు రాకూడదన్న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఆదెల్ సుమారీవాలాతో ఏకీభవించటం కొంత కష్టమే. సగం స్వర్ణాలు క్రికెట్, కబడ్డీ, హాకీ వగైరాలకే వచ్చాయి. ఇవన్నీ జట్టు సమష్టి బలాన్ని చాటాయి... నిజమే. కానీ వ్యక్తిగత ఈవెంట్లలో మరింత మెరుగ్గా ఉంటే ఒలింపిక్స్‌కు అది లాభిస్తుంది. అంతర్జాతీయ సందర్భాల కోసం కఠిన నిబంధనలతో క్రీడాకారుల ఎంపిక, శిక్షణ వగైరాలు మంచిదే. కానీ పాఠశాల స్థాయినుంచే ఈ రంగంలో అర్హులైనవారిని గుర్తించి, స్పోర్ట్స్ అథారిటీలు, అకాడెమీలద్వారా వారిని సానబడితేనే జాతీయ స్థాయిలో మెరికల్లాంటి క్రీడాకారులు రూపొందుతారు. మన బడుల్లో మంచినీరు, మరుగుదొడ్లువంటి మౌలిక సదుపాయాల కల్పనే అంతంతమాత్రం. అలాంటిచోట క్రీడలకు చోటిస్తారని ఆశించటం దురాశే. ఏదేమైనా ఇప్పుడు బయటపడిన లోటుపాట్లను నిశితంగా గమనించి సరిదిద్దుకుంటే 2028లో జరిగే లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ నాటికి, 2030లో జరిగే దోహా ఆసియా క్రీడోత్సవాలనాటికి మన దేశం మరింత ఉన్నత స్థాయికెదుగుతుంది.

వైసీపీలో జలధార వణుకు...



కడప,కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుపెట్టి అమరజీవి జలధార పథకానికి శ్రీకారం చుట్టడం చూసి తాడేపల్లి సహా స్థానిక వైసీపీ నేతలకు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. పల్లెల్లోని ప్రతి గడపకూ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి దాహం తీర్చే బృహత్తర కార్యక్రమం తమ ఇలాకాలో మొదలవుతుంటే.. అయ్యో, వీళ్లు ఇంత మంచి పని చేస్తే ఇక కడప గడ్డపై మా ఉనికేం కావాలి.. మా ప్యాలెస్ పలుకుబడి ఏమైపోవాలి అన్న భయం వైసీపీ నేతలను నిలువునా దహించివేస్తోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రజల్లో తమ పరపతి ఎక్కడ గల్లంతవుతుందోనన్న బెంగతో చిత్రవిచిత్ర విన్యాసాలకు తెరలేపారు.తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రాయలసీమకు చేసిందేమీ లేకపోయినా.. ఇప్పుడు కూటమి సర్కార్ రాయలసీమ రైజింగ్ కింద సుమారు లక్ష కోట్ల భారీ ప్రణాళికతో హార్టికల్చర్ హబ్, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం చుడుతుంటే వైసీపీ తట్టుకోలేకపోతోంది. ప్రభుత్వం ఒక విజన్‌తో అడుగులు వేస్తుంటే, దాన్ని డైవర్ట్ చేసేందుకు తమదైన ఫేక్ ఫ్యాక్టరీకి పనిచెప్పారు. ప్రొద్దుటూరు పరిసరాల్లో అర్ధరాత్రి వేళ దొంగచాటుగా వెళ్లి.. పంటలు ఎండిపోతున్నాయి.. రూ. లక్ష కోట్లు ఎక్కడ అంటూ వింత పోస్టర్లు పొలాల్లో పెట్టారు. ఆ వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఇందులో అసలైన కామెడీ ఏమిటంటే.. ఆ పోస్టర్లు వేసింది తామేనని చెప్పుకునే కనీస దమ్ము, ధైర్యం కూడా వైసీపీ నేతలకు లేకపోవడమే!పోస్టర్ల కింద దర్జాగా పార్టీ పేరు గానీ, పార్టీ గుర్తు గానీ పెట్టుకోలేక.. రాయలసీమ రైతులు అనే ముసుగు తగిలించుకుని దొంగచాటు రాజకీయం నడుపుతున్నారు. ఆ పోస్టర్లు వేయించింది ఎవరో, ఆ స్క్రిప్ట్ ఎవరిదో పసిగట్టడానికి ప్రజలకు పెద్దగా పరిశోధనలేమీ అక్కర్లేదు. రాజకీయాల్లో విమర్శలు చేయాలంటే గుండెల నిండా ధైర్యం ఉండాలి, కానీ ఇలా రైతుల పేరుతో తెరవెనుక దాక్కుని దొంగ పోస్టర్లు అంటించడం వైసీపీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. ప్రజల ముందుకు వచ్చి మాట్లాడే మొహం లేక, ఇలా ట్యాగ్‌లైన్ల వెనుక దాక్కోవడం కడప రాజకీయ చరిత్రలోనే ఒక వింత రికార్డు అనే సెటైర్లు వినిపిస్తున్నాయి.జగన్ రెడ్డి అధికారంలో ఉన్నన్నాళ్లూ కడప జిల్లా రైతులే కాదు, చివరకు పులివెందుల రైతులు కూడా సాగునీరు, తాగునీరు అందక నానా ఇబ్బందులు పడ్డారు. ఆ ఐదేళ్లూ నోరు మెదపని నాయకులు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సీమను నన్యశ్యామలం చేసేందుకు నిధులు నమకూరుస్తుంటే ఓర్వలేకపోతున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిల్లాకు చేసిందేమీ లేకపోయినా, ఇప్పుడు ఇంటింటికీ కుళాయి నీరు, రైతులకు ఉద్యానవన ప్రాజెక్టులు వస్తుంటే మాత్రం పోస్టర్లు వేసి సంతృప్తి పడుతున్నారు.

గ్రామాల్లో ఫ్యాన్ ఖాళీ

2024 ఎన్నికల సమయం లో తాడేపల్లిగూడెం లో నిర్వహించిన కూటమి సభ కూటమి పార్టీల అభిమానులకు ఒక మధుర జ్ఞాపకం అని చెప్పొచ్చు. పవన్ కళ్యాణ్ ఎంతో ఆవేశంతో వైసీపీ పార్టీ ని పాతాళంలోకి తొక్కకపోతే నా పేరు పవన్ కళ్యాణ్ కాదు , నా పార్టీ జనసేన కాదు అని పెద్ద సవాల్ విసరడం వంటివి మనం అంత తేలికగా మనం మర్చిపోగలమా చెప్పండి. అప్పట్లో ఈ సవాల్ ని వైసీపీ వాళ్ళు చాలా కామెడీ గా తీసుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వాళ్లకు మబ్బులు వీడిపోయాయి. పవన్ కళ్యాణ్ చెప్పిందే చేసాడు కదా అని అప్పుడు బాధపడ్డారు. అయితే అది కేవలం టీజర్ మాత్రమే.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లో వైసీపీ ని ఖాళీ చేసే వ్యూహాన్ని రచించాడు పవన్ కళ్యాణ్. ఇప్పటికే గ్రామాల్లో వేల సంఖ్యలో వైసీపీ క్యాడర్ జనసేన పార్టీ కి షిఫ్ట్ అవుతూ వస్తోంది. గ్రామీణ ఎన్నికలు మొదలయ్యేలోపు వైసీపీ క్యాడర్ మొత్తాన్ని జనసేన కి షిఫ్ట్ అయ్యేలా మాస్టర్ ప్లాన్ వేసాడు పవన్ కళ్యాణ్. ఇదే కనుక జరిగితే జగన్ కి చావుదెబ్బ నే అని చెప్పొచ్చు. మాజీ సీఎం జగన్ తాను గతం లో చేసిన తప్పులు , పొరపాట్లను సరిదిద్దుకొని , ముందుకు వెళ్తే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. తాను ఇప్పటికీ అద్భుతమైన పాలన ని అందించానని , దొంగ ఈవీఎం లు వాడి కూటమి పార్టీలు అధికారం లోకి వచ్చాయనే ఊహల్లోనే జగన్ మరియు ఆయన అనుచరులు ఉన్నారు. ఇలాంటి ఊహల్లో ఉన్నంత కాలం టీడీపీ , జనసేన పార్టీ లకు తిరుగు ఉండదు అనే చెప్పాలి.విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పరిస్థితి ఎలా తయారైందో చూస్తూనే ఉన్నాం. మన కళ్ల ముందే ఆ పార్టీ కుప్పకూలిపోయింది. వైసీపీ క్యాడర్ మొత్తం ఇప్పుడు టీడీపీ సొంతమైంది. అతి త్వరలోనే బొత్స సత్యనారాయణ జనసేన పార్టీ లో చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అదే కనుక జరిగితే విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పునాదులతో సహా కొట్టుకుపోయినట్టే అని చెప్పొచ్చు. ఇదే తరహా ఆపరేషన్ ని టీడీపీ , జనసేన అన్ని జిల్లాల్లోనూ చేస్తోంది. ముఖ్యంగా జనసేన పార్టీ లో స్పేస్ ఎక్కువ ఉండడం తో వైసీపీ బడా లీడర్లు చేరుతున్నారు. అనుకున్నది అనుకున్నట్టు చేస్తే వచ్చే ఏడాది లో పాదయాత్ర చేస్తానన్న జగన్ కి చుక్కలు కనిపిస్తాయి. ఎందుకంటే అత్యధిక శాతం వైసీపీ క్యాడర్ టీడీపీ,జనసేన పార్టీల్లో ఉంటాయి ,పాదయాత్ర కి కావాల్సినంత డబ్బు పెట్టే నాయకులు కూడా ఉండరు. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.

బియ్యం ధరాఘాతం.. తెలంగాణలో సామాన్యుడిపై పెను భారం

హైదరాబాద్,తెలంగాణలో బియ్యం ధరలు సామాన్యుడి వంటింటిపై గట్టిగానే ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్రంలో వరి ఉత్పత్తి భారీగా ఉన్నప్పటికీ.. సన్నబియ్యం ధరలు మాత్రం వరుసగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అధిక డిమాండ్ ఉన్న సన్న రకాల ధరలు గత మూడు నెలల్లో గణనీయంగా పెరిగాయి. కిలో బియ్యం సగటు ధర జూలైలో రూ.55 ఉండగా.. ఆగస్టులో రూ.59కు, సెప్టెంబరులో రూ.65కు చేరింది. ప్రస్తుతం కిలో సగటు ధర రూ.79కు చేరినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అంటే మూడు నెలల వ్యవధిలో కిలోపై దాదాపు రూ.24 మేర పెరుగుదల నమోదైంది.

26 కిలోల బియ్యం బస్తాపై రూ.500 భారం

సన్నబియ్యం ధరల పెరుగుదల రిటైల్ మార్కెట్‌లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఆగస్టు తొలి వారంలో 26 కిలోల సన్నబియ్యం బస్తా సుమారు రూ.1,550 ఉండగా.. సెప్టెంబరులో రూ.1,750కు చేరింది. అక్టోబరులో మరో రూ.300 మేర పెరగడంతో ప్రస్తుతం అదే బస్తా ధర సుమారు రూ.2,050కు చేరినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంటే రెండు నెలల వ్యవధిలోనే బస్తాపై దాదాపు రూ.500 భారం పడింది.

సన్నబియ్యానికే అధిక గిరాకీ

తెలంగాణ వినియోగదారుల్లో సన్నబియ్యానికి ప్రత్యేక డిమాండ్ ఉంది. హెచ్‌ఎంటీ, బీపీటీ, జైశ్రీరాం తదితర రకాల బియ్యానికి పట్టణాలు, నగరాల్లో ఎక్కువగా గిరాకీ ఉండటంతో వాటి ముడి ధాన్యం ధరలు కూడా పెరుగుతున్నాయి. హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో బ్రాండెడ్, ప్రీమియం సన్నబియ్యానికి డిమాండ్ అధికంగా ఉండటంతో రిటైల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

తగ్గిన వరి సాగు

గత ఖరీఫ్‌లో తెలంగాణలో వరి సాగు గణనీయంగా జరిగింది. రైతులకు సన్న రకాలపై క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో పలువురు రైతులు సన్న ధాన్యం సాగు వైపు మొగ్గుచూపారు. మంచి వర్షాలు, అనుకూల పరిస్థితులతో గత ఏడాది వరి దిగుబడి కూడా ఆశాజనకంగానే నమోదైంది.అయితే ఈ ఏడాది పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. రాష్ట్రంలోని గోదాముల్లో నిల్వలకు స్థలం లేకపోవడం, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించడం వంటి కారణాలతో ఖరీఫ్ ప్రారంభంలో వరి సాగుపై రైతుల్లో ఆసక్తి తగ్గింది. అనంతరం వర్షాలు కురవడంతో కొంత విస్తీర్ణంలో వరి సాగు జరిగినప్పటికీ.. గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఖరీఫ్‌లో సుమారు 67.24 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా.. ఈ ఏడాది అది దాదాపు 56.6 లక్షల ఎకరాలకు తగ్గినట్లు మార్కెట్ నివేదికలు సూచిస్తున్నాయి.

ప్రభుత్వ కొనుగోళ్ల ప్రభావం

రాష్ట్రంలో ధాన్యం సేకరణ కూడా బియ్యం మార్కెట్‌పై ప్రభావం చూపుతున్న అంశాల్లో ఒకటిగా వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేయడంతో ఓపెన్ మార్కెట్‌లో మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులకు అందుబాటులో ఉండే ధాన్యం పరిమాణం తగ్గే అవకాశం ఉంది. సన్న రకాలపై ప్రభుత్వం అందిస్తున్న బోనస్ కారణంగా రైతులు ప్రభుత్వ కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా మార్కెట్ సరఫరాపై ప్రభావం చూపుతోంది.

రైతుకు మేలు.. వినియోగదారుడికి భారమా?

కొన్ని జిల్లాల్లో సన్న ధాన్యానికి మంచి ధరలు లభిస్తున్నాయి. నల్లగొండ, యాదాద్రి భువనగిరి తదితర ప్రాంతాల్లో సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.3,200--3,300 వరకు ధర లభిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రైతుకు మెరుగైన ధర లభించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ.. ముడి ధాన్యం ధర పెరిగిన ప్రభావం చివరకు బియ్యం ధరపై పడుతోంది. మిల్లింగ్, రవాణా, నిల్వ, ప్యాకింగ్, బ్రాండింగ్ తదితర వ్యయాలు కూడా కలవడంతో వినియోగదారుడు కొనుగోలు చేసే బియ్యం ధర మరింత పెరుగుతోంది.



'ఎల్‌నినో' పేరుతో నిల్వలా?

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్న చర్చలు మార్కెట్‌లో సాగుతున్నాయి. ఈ అంచనాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు తమ వద్ద ఉన్న నిల్వలను వెంటనే మార్కెట్‌లోకి విడుదల చేయకుండా ధరల పెరుగుదల కోసం వేచి చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఎల్‌నినో ప్రభావం ఎంతమేర ఉంటుందన్నది వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కేవలం అంచనాల ఆధారంగా నిల్వలు పెంచడం మార్కెట్‌లో కృత్రిమ కొరతకు దారితీయకుండా అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

మిగులు రాష్ట్రంలో ధరల మంట ఎందుకు?

తెలంగాణ దేశంలోని ప్రధాన వరి ఉత్పత్తి రాష్ట్రాల్లో ఒకటి. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి భారీగా ఉన్నప్పటికీ వినియోగదారుల మార్కెట్‌లో బియ్యం ధరలు పెరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉండటం మాత్రమే తుది బియ్యం ధరను నిర్ణయించదు. ప్రభుత్వ సేకరణ, మిల్లింగ్ సామర్థ్యం, నిల్వ సదుపాయాలు, రవాణా ఖర్చులు, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నిల్వలు, వినియోగదారుల డిమాండ్, ఇతర రాష్ట్రాలకు సరఫరా వంటి అనేక అంశాలు ధరను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పటికీ ఓపెన్ మార్కెట్‌లో అందుబాటులో ఉండే సన్నబియ్యం పరిమాణం తగ్గితే ధరలు పెరిగే అవకాశం ఉంటుంది.

నెలకు వందల రూపాయల అదనపు భారం

బియ్యం ధర పెరుగుదల నేరుగా కుటుంబ బడ్జెట్‌ను ప్రభావితం చేస్తోంది. నెలకు 25 నుంచి 50 కిలోల బియ్యం వినియోగించే కుటుంబానికి కిలోపై రూ.5 నుంచి రూ.10 అదనంగా చెల్లించాల్సి వచ్చినా నెలాఖరులో మూడు వందల రూపాయల భారం పెరుగుతుంది. ఇప్పటికే కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, ఇతర నిత్యావసరాల ధరలతో ఇబ్బంది పడుతున్న మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు ఇది మరింత భారంగా మారుతోంది.

సరఫరాపై నిఘా అవసరం

తెలంగాణలో ధాన్యం కొరత లేకపోయినా బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మార్కెట్ పరిస్థితిని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు ఉంటే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. మిల్లర్ల వద్ద ఉన్న నిల్వలు, ప్రభుత్వ సేకరణ, ఓపెన్ మార్కెట్ సరఫరా, రిటైల్ ధరలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. కొత్త పంట మార్కెట్‌కు వచ్చిన తర్వాత ధరలు సహేతుక స్థాయికి చేరేలా సరఫరా వ్యవస్థను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది.మొత్తంగా.. తెలంగాణ మిగులు ధాన్యం రాష్ట్రంగా ఉన్నప్పటికీ సన్నబియ్యం ధరలు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను కుదేలు చేస్తున్నాయి. రైతుకు మంచి ధర దక్కడం అవసరమే అయినా.. అదే సమయంలో వినియోగదారుడిపై అనవసర భారం పడకుండా ప్రభుత్వం ఉత్పత్తి నుంచి మార్కెట్ వరకు మొత్తం సరఫరా గొలుసుపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది.

ధ్రువీకరణ పత్రాలకూ ముడుపులా?

తొర్రూరు,ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా అందించాల్సిన రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు ఫ్యామిలీ సర్టిఫికెట్ల జారీకి అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై హరిపిరాల గ్రామస్తులు తొర్రూరు తహసీల్దార్ గడిల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం.. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు, ఫ్యామిలీ సర్టిఫికెట్ల కోసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు డబ్బులు అడుగుతున్నారని పేర్కొన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నా వివిధ కారణాలతో తిరస్కరించడం, అనంతరం సంబంధిత కార్యాలయాలను ఆశ్రయిస్తే డబ్బులు చెల్లించిన తర్వాత పనులు పూర్తవుతున్నాయని వాపోయారు. కొన్ని సందర్భాల్లో సర్టిఫికెట్లపై సంతకాల కోసం కూడా డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు.హరిపిరాల, కర్కాల గ్రామాలకు జీపీఓగా పనిచేస్తున్న గాదరబోయిన అచ్చయ్యపై గతంలోనూ ఫిర్యాదులు వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. తాజాగా హరిపిరాల గ్రామస్థులు ఆయనను మార్చాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తులను తిరస్కరించడం, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, అనంతరం డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని కోరారు.హరిపిరాల గ్రామానికి చెందిన మిట్టకోల అశోక్ తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. తన పెద్దనాన్న మిట్టకోలా నారాయణకు సంబంధించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో రూ.2 వేలు తీసుకున్నారని, అనంతరం ఫోన్‌పే ద్వారా మరో రూ.వెయ్యి పంపించినట్లు చెప్పారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ కాలేదని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించి సర్టిఫికెట్ ఇప్పించాలని ఉన్నతాధికారులను కోరారు. జీపీఓ గాదరబోయిన అచ్చయ్యపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిస్తామని తొర్రూరు తహసీల్దార్ గడిల శ్రీనివాస్ తెలిపారు. గతంలోనూ ఆయనపై ఫిర్యాదులు తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ సేవల విషయంలో అక్రమాలకు, అవకతవకలకు తావు లేదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు హరిపిరాల జీపీఓను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

హిజ్రాల దందాలో పురుషులు...

హైదరాబాద్, హైదరాబాద్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. తాజాగా జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ ఈచి కారును అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది.పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు మహిళల మాదిరిగా చీరలు ధరించి, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల వేషధారణలో రోడ్డుపైకి వచ్చారు. అనంతరం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ ఈచి కారును అడ్డుకుని అందులో ఉన్న వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నలుగురు కలిసి కారును అడ్డుకోవడంతో వాహనదారుడు ఇబ్బందికి గురైనట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.ఈ వీడియోపై స్పందించిన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. అనంతరం కారును అడ్డుకున్న నలుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో వారు పురుషులేనని, డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో మహిళల మాదిరిగా దుస్తులు ధరించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో డబ్బులు అడుగుతున్న కొందరి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు గతంలోనూ వచ్చాయి. కొన్నిసార్లు డబ్బులు ఇవ్వకపోతే ఒత్తిడి చేయడం, వాహనాలను అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు.ఇటీవల ఓ గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లిన కొందరు వ్యక్తులు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసిన ఘటన కూడా చర్చనీయాంశంగా మారింది. ఒక మహిళను ఇబ్బంది పెట్టి రూ.50 వేల వరకు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇలాంటి ఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలనే డిమాండ్లు పెరిగాయి.అయితే ఈ ఘటనలను మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి ఆపాదించకూడదని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. చట్టవిరుద్ధంగా డబ్బులు వసూలు చేసే వ్యక్తులపై వారి లింగ గుర్తింపుతో సంబంధం లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.జూబ్లీహిల్స్ ఘటనలో నలుగురి అరెస్టుతో మరోసారి నగరంలో బహిరంగ ప్రదేశాల్లో డబ్బుల వసూళ్ల అంశం చర్చకు వచ్చింది. ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా వాహనాలను అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని పోలీసులు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. వైరల్ వీడియో ఆధారంగా ప్రారంభమైన ఈ కేసులో తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రెండో గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం

కరీంనగర్ ,కొత్తపల్లి లోని స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండో గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొని గిరి ప్రదక్షిణలో భాగస్వాములయ్యారు. కార్యక్రమాన్ని ముందుగా

గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జిఎస్టి వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది.2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జిఎస్టి వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జిఎస్టి వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జిఎస్టి వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది. ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జిఎస్టి రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది.ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా.. వినియోగం.. వ్యాపార కార్యకలాపాలు.. పన్ను అనుసరణ వంటి అనేక అంశాలు కూడా జీఎస్టీ వసూళ్లకు దోహదం చేశాయని వాణిజ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో సెప్టెంబర్ 2026 లో మొత్తం స్థూల జిఎస్టి వసూళ్లు కూడా 14.7% పెరిగాయి. మొత్తంగా 2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొత్తంగా చూస్తే జిఎస్టి వసూళ్లలో ఏపీ నమోదు చేస్తున్న అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించే పరిణామం లాగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఏపీ రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధిస్తుంది. సమర్థవంతమైన నాయకత్వం.. ఆర్థిక అంశాలలో పొదుపు వల్ల ఈ స్థాయిలో వసూళ్లు సాధ్యమయ్యాయి. కాగా, ఏపీ ఖజానా ఇలా కావడం.. జగన్ కు మింగుడుపడని వార్త అని టీడీపీ నాయకులు అంటున్నారు.

ఇక పాదయాత్రల సీజన్

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు రానున్న కాలంలో పూర్తిగా వీధులు, పల్లె బాట పట్టనున్నాయి. 2028 సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికలకు సెమిఫైనల్ కానున్న 2027 సంవత్సరం రాష్ట్రంలో అక్షరాలా పాదయాత్ర నామ సంవత్సరం గా మారబోతోంది. తెలుగు నాట అధికారం దక్కించుకోవడానికి లేదా నిలబెట్టుకోవడానికి కాలినడకనే అత్యంత శక్తివంతమైన రాజకీయ అస్త్రంగా గట్టిగా నమ్ముతున్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర గళాలు సైతం బూట్ల లేసులు కట్టుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఎవరి వ్యూహాలు వారికున్నప్పటికీ, 2027లో రాష్ట్రంలోని ప్రధాన రహదారులన్నీ రాజకీయ నేతల పాదయాత్రలతో కిక్కిరిసిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.ప్రధానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2027లో చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త పాదయాత్రపై ఇప్పటికే ఆ పార్టీ శ్రేణుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజల్లో పట్టు పెంచుకునేందుకు, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ పాదయాత్రనే గేమ్ ఛేంజర్ గా ఆయన భావిస్తున్నారు. మరోవైపు, తెలంగాణ రక్షణ సేన పెట్టి సీఎం అయిపోతానని శపథం చేస్తున్న కల్వకుంట్ల కవిత సైతం మహిళా లోకం, సింగరేణి సహా క్షేత్రస్థాయి కార్మిక వర్గాలతో మమేకమయ్యేలా సమాంతర పాదయాత్ర ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు.ప్రతిపక్షాలకు ఆ ఒక్క స్పేస్ కూడా వదిలిపెట్టకూడదని అధికార కాంగ్రెస్ శిబిరం కూడా భారీ సన్నాహాలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల క్షేత్రస్థాయి ఫలితాలను ప్రజలకు వివరిస్తూ ప్రతిష్టాత్మక పాదయాత్రకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. సీఎంకు తోడుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ వేర్వేరు ప్రాంతాలను ఎంచుకుని పాదయాత్రల ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. గతంలో భట్టి చేసిన పీపుల్స్ మార్చ్ కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించగా, ఈసారి అధికారాన్ని నిలబెట్టుకునే రక్షణ కవచం గా కాంగ్రెస్ త్రయం పాదయాత్రలను మలచుకోనుంది.ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో పాటు ఇతర కాషాయ నేతలు కూడా ప్రజా సమస్యలపై పాదయాత్రలతో ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తుండగా, ఇప్పటికే పలు అంశాలపై క్షేత్రస్థాయిలో ఉన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనదైన శైలిలో ప్రజా గొంతుకగా పాదయాత్రను కొనసాగించే యోచనలో ఉన్నారు. ఇలా అధికార పార్టీ నుంచి ముగ్గురు కీలక నేతలు, ప్రధాన ప్రతిపక్షం నుంచి కేటీఆర్, కవితలతో పాటు బీజేపీ, ఇతర గళాలు ఏకకాలంలో రోడ్లపైకి వస్తే ప్రజలు ఎవరి నడకను నమ్ముతారు, ఎవరికి జై కొడతారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికలకు ఏడాదిన్నర ముందే మొదలయ్యే ఈ పాదయాత్రల హోరుతో 2027లో తెలంగాణ రాజకీయాలు తారాస్థాయికి చేరడం ఖాయమని అనుకోవచ్చు.

అధికార, ప్రతిపక్ష కుటుంబాల ఆస్తుల పంచాయతీ

పటాన్ చెరు,అధికార, ప్రతిపక్ష కుటుంబాల ఆస్తుల పంచాయతీ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ కి మెదక్ ఎంపీ రఘునందన్ రావు లేఖ రాసారు . పత్రికల లో వచ్చిన ఆరోపణల వివరాలను జతపరిచారు. ఆ రెండు కుటుంబాల ఆస్తులపై వెంటనే విచారణ జరపాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుల మధ్య జరుగుతున్న ఆస్తుల పంచాయతీ గురించి విచారణ జరిపించమని ఎవరూ అడగడం లేదంటున్నారు. సోమవారం వరకు చూసి న్యాయ విచారణ జరగని పక్షంలో నేనే అడుగుతూ అన్నారు.ఈ రోజు ఉదయం 10:30 గంటలకు హైకోర్టు తెరిచే సమయానికి డ్రాఫ్ట్ చేసిన ఫిర్యాదు గౌరవ హైకోర్టు న్యాయమూర్తికి ఫిర్యాదు చేశాను. ఇది సిల్ ఓ రూపం లో కానీ విచారణ రూపంలో కానీ వెంటనే స్వీకరించాలని రాతపూర్వక ఫిర్యాదు చేశాను. అక్టోబర్ 2 న నేను చెప్పినట్టుగా ఈ ఫిర్యాదు చేశాను. సీఎం మీద కేటీఆర్, బీఆర్ఎస్ నా మీద సీఎం చేసిన ఆరోపణలు రెండింటిని జతపరిచి తర్జుమా కూడా చేశాను. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిసిగారికి కూడా ఫిర్యాదు చేస్తానని అన్నారు.బీఆర్ ఎస్ వారు కేసీఆర్ కుటుంబం దోచుకుందని చెప్తున్న లక్ష కోట్ల రూపాయలు... రెండున్నర సంవత్సరాల లో రేవంత్ రెడ్డి సంపాదించిన యాభై వేల కోట్ల రూపాయలు మొత్తం ప్రజలకు పంచాలని కోరుతున్న. అటు ప్రతిపక్ష కుటుంబం, ఇటు సీఎం కుటుంబం అఫిడవిట్ల కన్నా ఎక్కువ ఉన్న ఆస్తుల ను వెంటనే గుర్తించి విచారణ చెయ్యాలని గౌరవ హైకోర్టును విన్నవిస్తున్న. రేపే

సౌదీకి పాక్-తుర్కియే రక్షణ.. మిడిల్ ఈస్ట్‌లో అసలు గేమ్ ఇప్పుడే మొదలైందా?

మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు కాస్త పెరగడమే ఆలస్యం.. మన పొరుగుదేశం పాకిస్థాన్‌కు మునుపెన్నడూ లేనంత రక్షణ పౌరుషం పొంగిపొర్లుతోంది. యెమెన్‌కు చెందిన హౌతీలు సౌదీ అరేబియా భూభాగాన్ని, విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించగానే తాము ఉన్నామంటూ ఇస్లామాబాద్ రంగంలోకి దూకడం ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక పెద్ద కామెడీగా మారింది. సొంత ఇంట్లో తినడానికి పిడికెడు మెతుకులు లేవు గానీ.. పొరుగుంటి భవంతికి సెక్యూరిటీ గార్డుగా మారతానంటూ పాక్ సగర్వంగా ప్రచారం చేసుకోవడం చూస్తుంటే 'మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె' అన్న నానుడి పక్కాగా సరిపోతుంది. తమ దేశంలో నింగినంటే ద్రవ్యోల్బణం, పెరిగిపోతున్న నిరుద్యోగం, దివాలా తీయడానికి సిద్ధంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకోవడం పక్కనబెట్టి సౌదీని కాపాడేందుకు ఆర్మీని పంపుతామనడం పాక్ నాయకుల దౌత్యపరమైన అత్యుత్సాహానికి నిలువెత్తు నిదర్శనం.మిడిల్ ఈస్ట్‌లో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. సౌదీ అరేబియా–హౌతీల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు బాబ్ అల్ మండేబ్ జలసంధి నుంచి గల్ఫ్ ప్రాంతం వరకు ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీకి అండగా పాకిస్థాన్, తుర్కియే దళాలు రంగంలోకి దిగడం ఇప్పుడు కొత్త చర్చకు తెరతీశాయి. అసలు పాక్ ఎందుకు ఈ యుద్ధంలోకి వస్తోంది? సౌదీకి రక్షణ కల్పించేంత సైనిక సామర్థ్యం పాక్‌కు ఉందా? లేక ఇది ఆర్థిక ప్రయోజనాల కోసం ఆడుతున్న మరో దౌత్య పాచికనే అన్నది అందరికీ అర్థమైపోయింది.

హౌతీలతో సౌదీకి కొత్త తలనొప్పి

యెమెన్‌కు చెందిన హౌతీ గ్రూప్‌తో సౌదీ అరేబియాకు ఉన్న వైరం కొత్తది కాదు. అయితే తాజాగా పరస్పర దాడులు తీవ్రం కావడంతో పరిస్థితి మరోసారి ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా బాబ్ అల్ మండేబ్ జలసంధి ప్రస్తావన రావడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన సముద్ర మార్గాల్లో ఒకటైన ఈ ప్రాంతంలో ఉద్రిక్తత పెరిగితే దాని ప్రభావం కేవలం సౌదీ, యెమెన్‌లకే పరిమితం కాదు. చమురు సరఫరా, షిప్పింగ్, బీమా వ్యయాలు, అంతర్జాతీయ వాణిజ్యంపై కూడా దాని ప్రభావం పడే అవకాశం ఉంటుంది. హౌతీలు సౌదీ గగనతలంలోకి విమానాలు రావద్దంటూ హెచ్చరించడం.. కింగ్ ఖాలిద్ ఎయిర్‌పోర్ట్, ఆరామ్‌కో రిఫైనరీ, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామని ప్రకటించడం.. ఉద్రిక్తత ఏ స్థాయికి చేరిందో చెప్పకనే చెబుతోంది.

పాక్ ఎంట్రీతో అసలు కథ మొదలు

ఇక్కడే పాకిస్థాన్ ఎంట్రీ ఆసక్తికరంగా మారింది. సౌదీ అరేబియాకు సైనిక సహాయం అందించేందుకు పాక్, తుర్కియే సిద్ధమవడం మిడిల్ ఈస్ట్ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. మక్కా ఒప్పందం ప్రకారం దళాలను పంపే అంశంపై చర్చలు జరగడం.. రియాద్‌లో విదేశాంగ, రక్షణ రంగ అధికారుల సమావేశాలు జరగడం వెనుక పెద్ద వ్యూహమే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సౌదీ–పాక్–తుర్కియే మధ్య కుదిరిన రక్షణ అవగాహన మరింత ఆసక్తికరం. మూడు దేశాల్లో ఏదో ఒక దేశంపై దాడి జరిగితే.. దానిని మిగిలిన దేశాలపై జరిగిన దాడిగానే పరిగణించే విధంగా ఒప్పందం కుదిరింది. అంటే ఇది కేవలం సౌదీకి పాక్ అందించే సైనిక సహాయం కాదు. మూడు దేశాల మధ్య ఒక కొత్త భద్రతా కూటమికి ఇది బీజం కావచ్చన్న విశ్లేషణలు మొదలయ్యాయి.

'పాక్‌కు అంత సీన్ ఉందా?'.. నెటిజన్ల సెటైర్లు

అయితే పాకిస్థాన్ రంగంలోకి దిగడంపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందన కనిపిస్తోంది. "సొంత ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న దేశం.. ఇప్పుడు సౌదీకి రక్షణ కల్పిస్తుందా?" అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. 'మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్న సామెతను గుర్తు చేస్తూ పాక్‌పై సెటైర్లు వేస్తున్నారు. ముందుగా తమ దేశంలోని ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించుకోవాలని కొందరు చురకలు అంటున్నారు. సౌదీ నుంచి లభించే ఆర్థిక ప్రయోజనాలు, పెట్టుబడులు, సహాయాన్ని దృష్టిలో పెట్టుకునే పాక్ ఈ నిర్ణయం తీసుకుంటోందన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అయితే ఈ విమర్శల వెనుక మరో కోణాన్ని కూడా చూడాలి. పాకిస్థాన్‌కు గల్ఫ్ దేశాలతో సైనిక, ఆర్థిక, దౌత్య సంబంధాలు దశాబ్దాలుగా ఉన్నాయి. కాబట్టి రియాద్‌కు భద్రతా సహకారం అందించడం ఇస్లామాబాద్‌కు పూర్తిగా కొత్త వ్యవహారం కాదు.

పాక్‌కు లాభం ఏంటి?



పాకిస్థాన్‌కు ఈ వ్యవహారంలో ప్రధానంగా మూడు ప్రయోజనాలు కనిపిస్తున్నాయి. మొదటిది ఆర్థిక ప్రయోజనం. సౌదీ అరేబియా పాకిస్థాన్‌కు కీలకమైన ఆర్థిక భాగస్వామి. పెట్టుబడులు, ఆర్థిక సహాయం, ఇంధన రంగ సహకారం వంటి అంశాల్లో రియాద్‌తో సంబంధాలు ఇస్లామాబాద్‌కు చాలా ముఖ్యమైనవి. రెండోది సైనిక ప్రభావం. సౌదీ భద్రతలో ప్రత్యక్ష పాత్ర పోషించడం ద్వారా పాక్ తన సైనిక సామర్థ్యాన్ని, ప్రాంతీయ ప్రాధాన్యతను మరోసారి చాటుకోవాలని చూస్తోంది. మూడోది దౌత్య ప్రయోజనం. అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్, సౌదీ, తుర్కియే వంటి శక్తుల మధ్య మిడిల్ ఈస్ట్‌లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ సమయంలో సౌదీకి దగ్గరగా ఉండటం పాక్‌కు అంతర్జాతీయ దౌత్యంలో ఒక అదనపు బలం కావచ్చు.

కానీ యుద్ధరంగం అంత ఈజీ కాదు

అయితే ఇక్కడే అసలు ప్రశ్న. సౌదీకి సైనిక సహాయం అందించడం ఒక విషయం. హౌతీలతో ప్రత్యక్ష యుద్ధంలోకి దిగడం మరో విషయం. హౌతీలకు క్షిపణులు, డ్రోన్లు, సముద్ర మార్గాలపై దాడి సామర్థ్యం వంటి అంశాలు ఉన్నాయి. వీరితో పోరాటం సంప్రదాయ యుద్ధంలా ఉండదు. సముద్ర మార్గాలు, డ్రోన్లు, మిసైళ్లు, అసమాన యుద్ధ వ్యూహాలు కీలకంగా మారవచ్చు. అందువల్ల పాక్ తన సైనిక బలగాలను ఎంతవరకు.. ఏ విధంగా ఉపయోగిస్తుంది అన్నదే కీలకం. సౌదీ భూభాగంలో భద్రతా బాధ్యతలు చేపట్టడానికే పరిమితమవుతుందా? లేక హౌతీలపై ప్రత్యక్ష ఆపరేషన్లలో పాల్గొంటుందా? అనేది చూడాల్సి ఉంటుంది.

తుర్కియే ఎందుకు కీలకం?

ఈ సమీకరణంలో తుర్కియే పాత్రను కూడా తక్కువ అంచనా వేయలేం. రక్షణ పరిశ్రమలో వేగంగా ఎదుగుతున్న తుర్కియే డ్రోన్లు, రక్షణ సాంకేతికత, సైనిక అనుభవం విషయంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. సౌదీతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం ద్వారా ఆ దేశం మిడిల్ ఈస్ట్‌లో తన ప్రభావాన్ని పెంచుకోవాలని చూస్తోంది. అంటే పాక్ సైనిక మానవ వనరులు, తుర్కియే సాంకేతిక–రక్షణ సామర్థ్యం, సౌదీ ఆర్థిక శక్తి.. ఈ మూడు కలిస్తే ఒక కొత్త ప్రాంతీయ భద్రతా సమీకరణం ఏర్పడే అవకాశం ఉంది.

ఇది హౌతీలతో యుద్ధమేనా? లేక పెద్ద గేమ్‌కు ఆరంభమా?

ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలను కేవలం సౌదీ–హౌతీ ఘర్షణగా చూడటం సరిపోదు. మిడిల్ ఈస్ట్‌లో అమెరికా పాత్ర, ఇరాన్ ప్రభావం, హౌతీలకు లభిస్తున్న మద్దతు, సౌదీ–తుర్కియే సంబంధాలు, పాక్ ఆర్థిక అవసరాలు.. ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. సౌదీపై దాడులు పెరిగితే పాక్, తుర్కియే ప్రత్యక్షంగా స్పందిస్తాయా? ఒకవేళ స్పందిస్తే ఇరాన్ ఎలా రియాక్ట్ అవుతుంది? హౌతీలు తమ దాడులను మరింత విస్తరిస్తారా? సముద్ర మార్గాల భద్రతకు ముప్పు ఏర్పడుతుందా? ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలే మిడిల్ ఈస్ట్ భవిష్యత్ సమీకరణాలను నిర్ణయించనున్నాయి.పాకిస్థాన్ సౌదీకి అండగా నిలవడం వెనుక కేవలం 'స్నేహం' మాత్రమే ఉందని చెప్పడం కష్టం. ఇందులో భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, సైనిక ప్రభావం, ప్రాంతీయ దౌత్యం.. అన్నీ కలిసే ఉన్నాయి. అదే సమయంలో పాక్‌పై వస్తున్న 'సొంత ఇంటిని చక్కదిద్దుకోలేని దేశం.. ఇతరులకు రక్షణ ఏంటి?' అన్న విమర్శలు కూడా రాజకీయంగా ఆసక్తికరమే. అయితే అసలు పరీక్ష మాటల్లో కాదు.. యుద్ధరంగంలో ఉంటుంది.హౌతీలపై పోరులో పాక్ నిజంగా ఎంత దూరం వెళ్తుంది? తుర్కియే ఎంతవరకు మద్దతు ఇస్తుంది? సౌదీ–పాక్–తుర్కియే కూటమి కేవలం రక్షణ ఒప్పందంగానే మిగులుతుందా? లేక మిడిల్ ఈస్ట్‌లో కొత్త శక్తి సమీకరణానికి నాంది పలుకుతుందా? ప్రస్తుతం ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఒక్కటే మిడిల్ ఈస్ట్‌లో అసలు గేమ్ ఇప్పుడే మొదలైందా? అంటే ఔననే అంటున్నారు..అసలు కథేంటంటే ఈ ఆపద్బాంధవ పాత్ర వెనుక ఉన్నది రక్షణ ఆరాటం కాదు రియాద్ నుంచి

ఏడెన్‌లో హైటెన్షన్ .. హౌతీల మిస్సైళ్ల దాడి



యెమెన్:యెమెన్‌లో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ మద్దతుతో కొనసాగుతున్న హౌతీ తిరుగుబాటుదారులు బుధవారం తెల్లవారుజామున దక్షిణ యెమెన్‌లోని కీలకమైన ఏడెన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని రెండు క్షిపణులను ప్రయోగించారు. అయితే ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఏడెన్ భద్రతా విభాగం మీడియా కార్యాలయం వెల్లడించింది.యెమెన్‌లో హౌతీల దూకుడు పెరగడం.. వారికి వ్యతిరేకంగా సౌదీ మద్దతుతో ప్రభుత్వ బలగాలు ఎదురుదాడికి దిగడంతో గత కొన్ని రోజులుగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముఖ్యంగా వ్యూహాత్మకమైన బాబ్ అల్ మండెబ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో ఆధిపత్యం కోసం పోరు మళ్లీ తీవ్రరూపం దాల్చింది.

ఏడెన్.. కీలక అంతర్జాతీయ ద్వారం

హౌతీల నియంత్రణలో లేని యెమెన్ ప్రాంతాలకు ఏడెన్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన ద్వారంగా ఉంది. దీంతో ఈ విమానాశ్రయంపై దాడి జరగడం ఆందోళనకు కారణమైంది. హౌతీలు ఇటీవలి వారాల్లో ఎర్ర సముద్ర తీర ప్రాంతాల్లో తమ ఆధిపత్యాన్ని విస్తరించేందుకు ప్రయత్నించారు. దీనికి ప్రతిగా సౌదీ మద్దతుతో ఉన్న యెమెన్ ప్రభుత్వ బలగాలు పెద్ద ఎత్తున ఎదురుదాడి ప్రారంభించాయిసౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాల వైమానిక సహకారంతో ప్రభుత్వ బలగాలు బాబ్ అల్ మండెబ్ జలసంధి సమీపంలోని పలు ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. దీంతో ఇరు వర్గాల మధ్య పోరు మరింత ముదిరింది.

సౌదీ నగరంపైకి బాలిస్టిక్ మిస్సైల్

ఇదే సమయంలో బుధవారం తెల్లవారుజామున సౌదీ అరేబియాలోని దక్షిణ నగరం ఖమీస్ ముషైత్ వైపు హౌతీలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని తమ బలగాలు అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ప్రకటించాయి.సౌదీ ప్రభుత్వ టెలివిజన్ ఈ విషయాన్ని వెల్లడించింది.హౌతీల నియంత్రణలో ఉన్న యెమెన్ రాజధాని సనా, అలాగే సాదా, అమ్రాన్ ప్రావిన్సుల నుంచి క్షిపణి ముప్పు పొంచి ఉందని సంకీర్ణ దళాలు పేర్కొన్నాయి.

సౌదీ దాడి చేసిందన్న హౌతీ మీడియా

సౌదీ సంకీర్ణ దళాల ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే హౌతీలకు అనుకూలంగా ఉండే అల్ మసీరా టీవీ మరో ఆరోపణ చేసింది.యెమెన్‌లోని ఇబ్బ్, తైజ్ ప్రావిన్సులను కలుపుకుని ఉన్న ప్రాంతంలో సౌదీ బలగాలు వైమానిక దాడి జరిపాయని పేర్కొంది. ఈ ఆరోపణలపై సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాల నుంచి వెంటనే ఎలాంటి అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు.

మళ్లీ యెమెన్ సంక్షోభం

ఎర్ర సముద్రం నుంచి బాబ్ అల్ మందెబ్ వరకు సాగుతున్న ఈ పోరు కేవలం యెమెన్‌కే పరిమితమైన అంశం కాదు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన సముద్ర మార్గాల్లో బాబ్ అల్ మందెబ్ ఒకటి. ఎర్ర సముద్రం, అరేబియా సముద్రం మధ్య రాకపోకలకు ఇది కీలక మార్గం కావడంతో ఇక్కడ ఉద్రిక్తతలు పెరిగితే అంతర్జాతీయ నౌకాయానంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.కొంతకాలంగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించిన హౌతీ–ప్రభుత్వ బలగాల పోరు ఇప్పుడు మళ్లీ వేడెక్కుతోంది. ఒకవైపు హౌతీలు క్షిపణి దాడులు కొనసాగిస్తుండగా.. మరోవైపు సౌదీ మద్దతుతో ప్రభుత్వ బలగాలు కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు దూకుడు పెంచుతున్నాయి.దీంతో ఏడెన్ విమానాశ్రయంపై దాడి నుంచి సౌదీ భూభాగంపై క్షిపణి ప్రయోగం వరకు.. యెమెన్ సంక్షోభం మరోసారి ప్రమాదకర మలుపు తిరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఉత్తరాంధ్రలో వైసీపీ గ్రాఫ్ ఏమౌతోంది

విశాఖపట్టణం,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోటగా నిలిచిన ఉత్తరాంధ్ర లో ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. 2024 ఎన్నికల ఓటమి తర్వాత కుదురుకుంటుందని భావించినప్పటికీ, కీలక నేతల వరుస రాజీనామాలు, సస్పెన్షన్లతో పార్టీ గ్రాఫ్ పడిపోయింది. విజయనగరం జిల్లాలో పార్టీకి వెన్నెముకగా ఉన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్సీపీకి రాజీనామా చేయడంతో బొత్స సత్యనారాయణ ప్రాబల్యంపైనే పెద్ద ప్రశ్నమార్క్ పడింది. దానికి తోడు బద్దుకొండ అప్పలనాయుడు సస్పెన్షన్, సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే దువ్వాడ శ్రీను పార్టీకి దూరం కావడంలాంటి కారణాలతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పార్టీ కొంత చేటు తెచ్చింది. ఇక .విశాఖపట్నం రాజకీయాలను పరిశీలిస్తే, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ సహా పలువురు కీలక నేతలు వైఎస్సార్సీపీకి వీడ్కోలు పలికారు. మిగిలిన కొద్దిమంది సీనియర్ నాయకులు సైతం వైఎస్సార్సీపీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటమే కాకుండా, నూతనంగా పార్టీలో చేరేందుకు ఏ ఒక్క ద్వితీయ శ్రేణి నాయకుడు కూడా ఉత్సాహం చూపడంలేదు. అధిష్టానం ఎంత ఒత్తిడి తెచ్చినా క్షేత్రస్థాయిలో కేడర్ను సమాయత్తం చేసే నాయకులు కరువయ్యారు. శ్రీకాకుళం నుంచి విజయనగరం వరకు పార్టీని నడిపించాల్సిన సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రభావం కూడా ఇప్పుడు నామమాత్రంగానే మారిపోయింది. తన స్వంత మేనల్లుడైన మజ్జి శ్రీనివాసరావును కూడా పార్టీలో నిలుపుకోలేకపోయారనే విమర్శలు వైఎస్సార్సీపీ వర్గాల నుంచే వస్తున్నాయి. రీజినల్ కోఆర్డినేటర్లు, ఇన్ఛార్జులు వచ్చి సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతున్నాయి. ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత ప్రజల్లో ఉన్న ఆ వ్యతిరేకతను అధిగమించేందుకు వైఎస్సార్సీపీ రీ-బిల్డింగ్ ప్లాన్స్ ఏవీ ఉత్తరాంధ్రలో పనిచేయడం లేదు. ఓటమి నిరాశ నుంచి బయటపడకముందే వరుస వికెట్లు పడిపోతుండటంతో పార్టీ క్యాడర్ అయోమయంలో వుంది. సరైన నాయకత్వం, స్పష్టమైన వ్యూహం, క్షేత్రస్థాయి పోరాటాలు లేకపోతే.. ఒకప్పుడు తన సొంత కోటగా భావించిన ఉత్తరాంధ్రలోనే వైఎస్సార్సీపీ ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

అసెంబ్లీ ఫార్ములా రగడ...

ఒంగోలు ,ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ఇప్పుడు

వివాహం వెనుక షర్మిల రాజకీయ వ్యూహం ఏంటి ?



హైదరాబాద్,తెలంగాణలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ పెట్టి విస్తృతంగా పాదయాత్ర చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి కూతురు వైఎస్ షర్మిల తీరా ఎన్నికల సమయానికి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఏపీ రాజకీయాల్లోకి వెళ్లిపోయింది. తన పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి అక్కడ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పదవి తీసుకుని 2024 లోక్ సభ ఎన్నికల్లో కడప పార్లమెంటు స్థానం నుండి కాంగ్రెస్ తరపున పోటీ చేసి 1.41 లక్షల ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితం అయింది.ఆ తర్వాత ఏపీలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం మీద, అంతకుముందు ఐదేళ్లపాటు ఏపీలో అధికారంలో ఉన్న తన సోదరుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన మీద తరచుగా విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఇద్దరి మధ్య ఉన్న ఆస్తుల వివాదం నేపథ్యంలో కుటుంబ పరంగా పెద్దగా సంబంధాలు లేవు.తాజాగా తన కూతురు వైఎస్ అంజిలిరెడ్డి వివాహం నేపథ్యంలో ఆమె తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటకతో పాటు జాతీయ స్థాయిలో ప్రముఖ రాజకీయ నాయకులను ఈ ఏడాది నవంబర్ 25న జరిగే కూతురి వివాహానికి ఆహ్వానించడంలో బిజీగా ఉంది.గత సెప్టెంబర్ 24న హైదరాబాద్ శివారు కొత్వాల్ గూడలో జరిగిన షర్మిల కూతురు అంజిలిరెడ్డి, అల్లుడు డాక్టర్ సోమల రఘురాం రెడ్డిల వివాహ నిశ్చితార్థానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి షర్మిల సోదరుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరు కాకపోవడం గమనార్హం.తన సోదరుడు గైర్హాజరు నేపథ్యంలో 'అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానించడం మర్యాద. పెళ్లిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసే ఖర్మ నాకు లేదని ' వైఎస్ షర్మిల వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రస్తుతం పెళ్లికి అయినా వైఎస్ జగన్ వస్తారా ? రారా ? అన్న ఉత్కంఠ నెలకొంది.పెళ్లికి రావాలని కోరుతూ వైఎస్ షర్మిల దంపతులు తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్, డీఎంకే కనిమొళి, మాజీ కేంద్ర మంత్రి ఏ.రాజా, ప్రేమలత విజయకాంత్ తదితరులను ఆహ్వానించే ప్రయత్నంలో ఉంది. ఈ నేపథ్యంలో గత కొన్నాళ్లుగా ఆమె రాజకీయంగా కొంత నిశ్శబ్దం పాటిస్తున్నారు.కాంగ్రెస్ నుండి పోటీ చేసి ఓడిపోయిన తర్వాత వైఎస్ షర్మిలను కర్ణాటక నుండి రాజ్యసభకు పంపుతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ స్థానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, మాజీ కేంద్ర మంత్రి మన్సూర్ అలీ ఖాన్ లకు అవకాశం కల్పించారు. కూతురు పెళ్లి నేపథ్యంలో జాతీయస్థాయి నేతలతో పాటు, పలువురు సీఎంలను కలుస్తున్న షర్మిల ఈ పరిచయాలను తన రాజకీయ భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగించుకుంటుందా అన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

రాహుల్ గాంధీ రైట్ ట్రాక్ లోకి వచ్చారా ?

న్యూఢిల్లీ,ఎలాంటి రాహుల్...ఇపుడు ఎలా కనిపిస్తున్నారు. ఇది కదా జనాల్లో అతి పెద్ద చర్చ. ఒకనాడు పప్పు అని తెగ ట్రోల్స్ చేశారు. ఇపుడు నిప్పుగా మారి చెరిగేస్తున్న తీరుని చూస్తున్న వారు అంతా అవాక్కు అవుతున్నారు. చెలరేగిపోతున్న దూకుడు చూసి షాక్ తింటున్నారు. గాంధీల వంశం అంటే నాయకత్వానికి పెట్టింది పేరు. అలాంటి చోట పప్పు ట్యాగ్ ఎలా సూట్ అవుతుంది. ఎందుకో రాహుల్ గాంధీ రాజకీయాల మీద సరిగ్గా ఫోకస్ పెట్టకపోవడం వల్లనే అలాంటి ట్రోల్స్ చేయడానికి ప్రత్యర్థులకు చాన్స్ వచ్చింది కానీ రాహుల్ గాంధీ లోపల అసలైన మెటీరియల్ అలాగే ఉంది. ఎంతైనా ఆయన ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరాగాంధీ మనవడు కదా. దేశ తొలి ప్రధాని పండిట్ నెహ్రూకి ముని మనవడు కదా. ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న రాజీవ్ గాంధీకి సిసలైన వారసుడు కదా. అందుకే రాహుల్ గాంధీలోని రాటుతేలిన రాజకీయాన్ని కాలం ముసుగు తీసి చూపిస్తూంటే ప్రత్యర్థులకు నమ్మబుద్ధి కాక దిమ్మ తిరుగుతోంది.

కర్కశ రాజకీయం నుంచే :

ఎవరైనా ధీటుగా సరిసాటిగా ఎదగాలంటే కాల పరీక్షలను తట్టుకుని నిలవాలి. రాహుల్ గాంధీ విషయంలో ఇపుడు అదే జరుగుతోంది. ఆయన రెండు దశాబ్దాలకు పైగా సాగిన రాజకీయ జీవితంలో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఈ స్టేజికి చేరుకున్నారు. తనలోని మాస్ అవతార్ ని ఆయనకు చూపించే చాన్స్ కాలమే ఇచ్చింది. దానితో పాటు ప్రత్యర్థులు కూడా ఇచ్చారు. రాహుల్ ని టార్గెట్ చేసి కార్నర్ చేసి సాగించిన కర్కశ రాజకీయమే ఆయనకు కఠినమైన గుణపాఠాలను నేర్పించింది. వాటి నుంచి నేర్చుకుంటూ రాహుల్ ఈ రోజు అత్యంత బలమైన కూటమి ఎన్డీయేని ఢీ కొట్టేందుకు అంతెత్తున తాను నిలిచి జనానికి కనిపిస్తున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన ర్యాలీలో బారికేళ్ళను దాటుకుని వాటి మీదనే నిలబడి ధీమాగా కనిపించిన రాహుల్ గాంధీని ఈ దేశంలో ప్రతిపక్ష నాయకత్వానికి ఒక శక్తివంతమైన చిహ్నంగా చూడాల్సి ఉంటుంది.

నిలబడి కలబడి :

వెన్ను చూపి పరుగు తీయడం ఎప్పుడూ నాయకత్వ లక్షణం కాదు, నిలబడి కలబడితేనే అది రాణిస్తుంది. జనాల నీరాజనాలను అందుకుంటుంది. రాహుల్ గాంధీ రాజ ప్రసాదాల నుంచి దిగి వచ్చిన మొదట్లో పప్పు అని అంటే అని ఉండొచ్చు. కానీ సగటు మనిషిగా మారి పాదయాత్ర చేసిన చోట, తాను కొలిచిన నేల సమస్తం ఆయనకు అందించిన అవగాహనతో సమగ్రమైన రూపంగా మారిన వేళ ఆయన ఈ దేశానికి ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అవతరించారు. ఇపుడు మరింత దూకుడు చేస్తూ సాగిస్తున్న పోరాటం కొత్త అంకానికి శ్రీకారం



చుడుతోంది. గత రెండేళ్లకు పైగా పాలక పక్షం తీరు మీద అలుపెరగని తీరులో రాహుల్ సాగిస్తున్న పోరాటాన్ని చూస్తున్న వారు అంతా అంటున్న ఒకే మాట రాహుల్ రైట్ ట్రాక్ లోకి వచ్చారు అని. ముల్లుని ముల్లుతోనే కోయాలి. రాజకీయాన్ని రాజకీయంతోనే చెక్ పెట్టాలి. ఈ సూత్రం తెలియడానికి రాహుల్ కి ఎక్కువ సమయం పట్టిందేమో తెలియదు కానీ ఇపుడు మాత్రం ఆయనకు ఒడుపూ విడుపూ అన్నీ అర్థమైపోయాయి. తాను కార్నర్ కావడం కాదు, ఎక్కడ గురి చూసి కొడితే అధికార పక్షం కకా వికలై విలవిలలాడుతుందే నేర్చిన నేర్పరిగా రాహుల్ గాంధీ కరెక్ట్ గానే టార్గెట్ చేస్తున్నారు. అందులో సక్సెస్ కూడా అవుతున్నారు.

ఆల్టర్నేషన్ లీడర్ గా :

రాజకీయాల్లో ఎపుడూ శూన్యత ఉండదు, అవకాశాలు ఎన్నో ఉంటాయి. వాటిని వెతుక్కుంటారు నాయకులు. ఇపుడు రాహుల్ గాంధీ చేస్తున్నది అదే. తన పోరాటాన్ని ఏ బారికేడ్లూ నిలువరించలేవు అంటూ వాటిని ఛేదించుకుని నిలువెత్తుగా నిలబడిన రాహుల్ గాంధీలోని డేరింగ్ డైనమిక్ లీడర్ షిప్ ని ఇపుడు దేశమంతా చూస్తోంది. మూడు దఫాలుగా అధికారంలో ఉంటూ యాంటీ ఇంకెంబెన్సీని మూటకట్టుకుంటూ ఆ బరువుతో తానే తగ్గిపోతూ పడుతూ లేస్తూ సాగుతున్న ఎన్డీయే ప్రస్థానానికి సరైన సమయంలో చెక్ పెట్టడానికి ఒక పవర్ ఫుల్ ఆల్టర్నేషన్ గా రాహుల్ గాంధీ ఎమర్జ్ అవుతున్నారు అన్నది అయితే రాజకీయ విశ్లేషణగా ఉంది. రాహుల్ తగ్గకు ఎక్కడా ఆగకు, ఇదే దూకుడుతో ముందుకు సాగాల్సిందే అంటూ జనాల నుంచి వినవస్తున్న నినాదాలు ఆయనలో కొత్త జోష్ నే కలిగిస్తున్నాయి. అందుకే రాహుల్ ఇపుడు ఎక్కడా తగ్గేది లేదంటున్నారు. ఇది అంతం కాదు ఆరంభం అంటూ సాగుతున్న ఆయన జోరుని చూసిన ప్రత్యర్థులు అయితే గుర్రం ఎగరగలదు అన్న పాత ముతక సామెతను గుర్తు చేసుకోవాల్సి వస్తోంది.

కేసీఆర్ పై రేవంత్ బ్రహ్మాస్త్రం : ఎర్రవెల్లి కేంద్రంగా కాకరేపుతున్న రాజకీయం

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ ను రాజకీయంగా ఇరుకున పెట్టే లక్ష్యంతో రేవంత్ తీసుకుంటున్న నిర్ణయాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. కేసీఆర్ ఫాం హౌసు ఉన్న ఎర్రవెల్లిలో అమరవీరుల కోసం కాలనీ నిర్మించాలని ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదన హీట్ పుట్టిస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ ను రాజకీయంగా దెబ్బతీయాలని భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమరవీరులకు ఇళ్లు నిర్మించాలనే అంశాన్ని బ్రహ్మాస్త్రంగా మలుచుకున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇందుకోసం కేసీఆర్ ఫాంహౌసుకు ఎదురుగా ఉన్న భూములను ఎంపిక చేసుకోవడమే రాజకీయంగా చర్చనీయాంశం అవుతోందని అంటున్నారు.ఇప్పటివరకు ఎర్రవెల్లి అంటే మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం మాత్రమే గుర్తుకు వచ్చేది. అయితే ఇప్పుడు అక్కడ అమరవీరుల కాలనీ నిర్మించి అంతే ప్రాచుర్యం తేవాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. దీనిద్వారా మాజీ సీఎం పక్కనే తాము అమరవీరులకు ఇళ్లు కట్టించి ఇచ్చామని చెప్పుకోవాలని రేవంత్ రెడ్డి ఎత్తుగడ వేశారని అంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించలేని పరిస్థితిని తీసుకురావడం ద్వారా ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీని ఇరుకున పెట్టేశారని అంటున్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రావడానికి కారణమైన తమను బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యం చేసిందనే అసంతృప్తితో ఉన్న ఉద్యమకారుల దృష్టిని ఆకర్షించి రాజకీయంగా పైచేయి సాధించారని అంటున్నారు.తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన అమరవీరులకు సకల సౌకర్యాలతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే నిర్ణయంతోపాటు అందుకు గడువు కూడా విధించడంతో తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంలో ఉద్యమ పార్టీగా చెప్పుకున్న బీఆర్ఎస్ కన్నా తానే ఉద్యమకారులకు బాసటగా నిలుస్తున్నానని చెప్పుకోవడం ద్వారా గులాబీ పార్టీ ఓటు బ్యాంకుకు చిల్లు పెట్టాలని సీఎం వ్యూహరచన చేశారని అంటున్నారు. ఇప్పటికే మాజీ సీఎం కేసీఆర్



ఫాంహౌసులో ప్రభుత్వ భూములు ఉన్నాయని ఆరోపణలతో సంచలనం సృష్టించిన రేవంత్, ఆయన ఫాం హౌసుకు ఎదురుగా అమరవీరుల కాలనీ నిర్మించడం ద్వారా తెలంగాణ సమాజాన్ని తనవైపు తిప్పుకునేలా ప్రణాళిక వేశారని అంటున్నారు.ఈ విధంగా తెలంగాణ తెచ్చిన పార్టీగా బీఆర్ఎస్ పార్టీకి ఉన్న గుర్తింపును హైజాక్ చేసేలా కూడా సీఎం రేవంత్ రెడ్డి ఎత్తుగడ వేశారని అంటున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ తెస్తే, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రచారం చేయడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ కన్నా కాంగ్రెస్ వల్లే తెలంగాణ కల సాధ్యమయిందని, బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక రాష్ట్రంలో తమ సొంత ఆస్తులు పెంచుకునేందుకు మాత్రమే పరిమితమయ్యారని ప్రచారం చేయడానికి ఈ అంశాన్ని వాడుకునేలా రేవంత్ రెడ్డి ప్లాన్ చేశారని అంటున్నారు. ఎర్రవెల్లిలో అమరవీరుల కోసం ప్రత్యేక కాలనీ నిర్మించడం ద్వారా, తమ త్యాగాలను గుర్తించలేదని ఇన్నాళ్లు బాధపడుతున్న ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేసినట్లు అవుతుందని సీఎం నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. మొత్తానికి ఒక్క నిర్ణయంతో తెలంగాణ రాజకీయాలను సీఎం రేవంత్ రెడ్డి షేక్ చేశారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణలో రోడ్డు ప్రమాదాల కట్టడికి జీవో.. డీజీపీ ఆనంద్ బిగ్ ప్లాన్!

హైదరాబాద్,దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను నివారించటానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను షురూ చేసింది. ఇందులో భాగంగా దేశం మొత్తం మీద అత్యధికంగా యాక్సిడెంట్లు జరిగిన వంద జిల్లాలను గుర్తించింది. వీటిలో 7జిల్లాలు తెలంగాణలో ఉన్నాయి. ఆయా జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలను తగ్గించటానికి ప్రత్యేక చర్యలను త్వరలోనే అమలు చేయనున్నారు. వీటిపై డీజీపీ సీ.వీ.ఆనంద్? బుధవారం రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి 7జిల్లాల కలెక్టర్లు, 4 పోలీస్? కమిషనరేట్ల కమిషనర్లు, సేవ్? ఫౌండేషన్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ మీటింగ్ జరిపారు.

ప్రమాద స్థలాలపై సమగ్ర విశ్లేషణ..

ప్రతి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలు, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలు, ఏ సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్న అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మార్గదర్శక్ పోర్టల్ డ్యాష్ బోర్డులో నమోదు చేయాలని డీజీపీ సూచించారు. అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

దేశంలో ఏటా 1.75 లక్షల మంది మృతి..

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఏటా సుమారు 1.75 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని డీజీపీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో ఏటా సుమారు 7 వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల మరణాల్లో తెలంగాణ దేశంలో ఏడో స్థానంలో ఉందన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనికి సంబంధించి త్వరలో జీవో వెలువడుతుందని వెల్లడించారు.

48 కీలక రోడ్డు ప్రమాద కారిడార్లు..

రాష్ట్రంలో రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించే లక్ష్యంతో తెలంగాణలోని ఏడు జిల్లాల్లో ప్రత్యేక జిల్లా రోడ్డు భద్రతా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. సేఫ్‌లైఫ్ ఫౌండేషన్ రూపొందించిన ఈ ప్రణాళికల్లో 2024, 2025 వణూ= గణాంకాల ఆధారంగా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించారు. మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో 48 కీలక ప్రమాద కారిడార్లు, నాలుగు లేదా అంతకంటే ఎక్కువ మరణాలు నమోదైన 230 డేంజర్? స్పాట్లు,



220 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 183 పాదచారుల ప్రమాద ప్రాంతాలను గుర్తించారు. ఇందులో సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 14 కీలక కారిడార్లు, రంగారెడ్డిలో 98 ప్రాధాన్య ప్రమాద ప్రాంతాలు, 99 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 66 పాదచారుల ప్రమాద ప్రాంతాలు ఉన్నట్టు నిర్ధారించారు. ఈ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలు, సమయాలు, రహదారి నిర్మాణం, ఇంజినీరింగ్ లోపాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

'4ఈ' విధానంతో ప్రమాదాల కట్టడి..

రోడ్డు ప్రమాదాల నివారణలో '4ఈ' విధానాన్ని అమలు చేయనున్నట్టు డీజీపీ తెలిపారు. ఇందులో ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రమాదాలకు కారణమయ్యే రహదారి లోపాలను గుర్తించి సరిదిద్దాలని సూచించారు.

'ఈ-డార్' (e-DAR)లో ప్రమాదాల నమోదు..

రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ ఎలక్ట్రానిక్ డిజిటల్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈ-డార్) నమోదు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. మార్గదర్శక్ పోర్టల్ లో ప్రమాదాలు, గాయపడిన వారి వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేయాలని చెప్పారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాల జియో ట్యాగ్ ఫొటోలను కూడా మార్గదర్శక్ పోర్టల్ డ్యాష్ బోర్డులో అప్? లోడ్? చేసే అవకాశం ఉందని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ విధానాలను ఈ సందర్భంగా వివరించారు.

లక్కీడ్రాలో పేర్లు వచ్చినా నిరాశే తప్పదా?



హైదరాబాద్,ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల లక్కీడ్రా ఎంపికలో ఊహించని పరిణామం ఎదురైంది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ కోసం నిర్వహించిన లక్కీడ్రాలో 16 నియోజకవర్గాల నుంచి 7,680 మంది పేదలు ఎంపికయ్యారు. అయితే ప్రొవిజినల్ అలాట్మెంట్ పత్రాలు అందకపోవడంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 9వ తేదీ లోపు మొదటి విడతగా రూ.లక్ష చెల్లించాల్సి ఉండగా చాలామందికి దరఖాస్తులు రిజెక్ట్ అయినట్లు మెసేజ్ లు వచ్చాయి. లబ్ధిదారులు దశలవారీగా రూ.6 లక్షలను హౌసింగ్ బోర్డుకు చెల్లించాల్సి ఉంది. దీంతో బాధితులు లబోదిబోమంటూ నాంపల్లిలోని హౌసింగ్ బోర్డు కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. క్షేత్రస్థాయి విచారణలో అడ్రస్ మారడం కారణాల వల్ల అధికారులు కొన్ని దరఖాస్తులను పక్కన పెట్టారు.

అసలు దరఖాస్తులు ఎందుకు రిజెక్ట్ అవుతున్నాయి

ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల క్షేత్రస్థాయి విచారణలో తలెత్తిన సమస్యల వివరాలు ఇలా ఉన్నాయి. లక్కీడ్రా ద్వారా ఎంపికైన వారిలో కేవలం 5,501 మందికి మాత్రమే ప్రొవిజినల్ అలాట్మెంట్ పత్రాలను జారీచేశారు. రాజేంద్రనగర్ బండ్లగూడ జాగీర్ ప్రాంతంలో అద్దెకు ఉండే ఓ వ్యక్తి ఇటీవల ఇల్లు ఖాళీ చేసి పక్కనే మరో ప్రాంతానికి మారినట్లు తెలిపారు. అయితే పాత అడ్రస్ లో నివాసం లేరన్న కారణంతో అధికారులు ఆయన దరఖాస్తును తిరస్కరించారు. ఇలాంటి సమస్యల వల్ల ఎంతోమంది అర్హులైన పేదలకు మొండిచేయి ఎదురైంది. ప్రభుత్వం నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకుని ఈ ప్రక్రియను చేపట్టింది. అయితే వేరే నియోజకవర్గాల్లో దరఖాస్తు చేసుకోవడం కూడా ఈ తిరస్కరణకు ప్రధాన కారణమని అధికారులు స్పష్టం చేశారు. సొంతిల్లు కల సాకారమవుతుందని సంతోషించిన పేద ప్రజలకు ఈ పరిణామం పెనుభారంగా మారింది.ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల దరఖాస్తుదారుల కోసం హౌసింగ్ బోర్డు కీలక వెసులుబాటు కల్పించింది. దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందవద్దని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ వెల్లడించారు. పొరపాటున వేరే నియోజకవర్గాల్లో దరఖాస్తు చేసుకున్న వారి కోసం ప్రత్యేకంగా వెబ్ సైట్ లో నియోజకవర్గ మార్పు ఆప్షన్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఆప్షన్ ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలో నిర్వహించబోయే తదుపరి లక్కీడ్రాలో వీరందరికీ మళ్లీ పాల్గొనే అవకాశం దక్కుతుందని భరోసా ఇచ్చారు. సాంకేతిక లోపాలు చిన్నపాటి చిరునామా మార్పులను సరిచేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని అధికారులు భరోసా ఇస్తున్నారు.

2030 నాటికి 100 కోట్ల 5జి యూజర్లు.. భారత్ టార్గెట్ ఇదే!



న్యూఢిల్లీ,భారత్‌లో 5G సేవల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రస్తుతం దేశంలో సుమారు 550 మిలియన్ల మంది 5G వినియోగదారులు ఉన్నారని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. 2030 నాటికి ఈ సంఖ్యను ఒక బిలియన్‌కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అంటే రాబోయే నాలుగేళ్లలో 5G వినియోగదారుల సంఖ్యను దాదాపు రెట్టింపు చేయాలని భారత్ భావిస్తోంది.ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026 10వ ఎడిషన్ ప్రారంభోత్సవంలో సింధియా ఈ విషయాలను వెల్లడించారు. భారత్‌లో 5G టెక్నాలజీ ప్రపంచంలోనే అత్యంత వేగంగా స్వీకరించబడిన 5G సాంకేతికతల్లో ఒకటిగా మారిందని ఆయన పేర్కొన్నారు. టెలికాం నెట్‌వర్క్ విస్తరణతో పాటు వినియోగదారుల సంఖ్య పెరగడం కూడా దేశంలో డిజిటల్ కనెక్టివిటీకి కీలకమైన మార్పుగా ఆయన అభివర్ణించారు. ప్రస్తుతం 5G వినియోగదారుల సంఖ్య 550 మిలియన్లకు చేరుకున్నప్పటికీ, ఈ స్థాయితో ఆగిపోవడం లేదని సింధియా స్పష్టం చేశారు. 2030 నాటికి 5G వినియోగదారులను ఒక బిలియన్‌కు తీసుకెళ్లడం తమ లక్ష్యమని చెప్పారు. దీంతో దేశంలో మరింత ఎక్కువ మంది వేగవంతమైన మొబైల్ ఇంటర్నెట్ సేవలను ఉపయోగించే అవకాశం ఉంటుంది.5G నెట్‌వర్క్ విస్తరణ కేవలం వేగవంతమైన ఇంటర్నెట్‌కు మాత్రమే పరిమితం కాదని ప్రభుత్వం భావిస్తోంది. మొబైల్ బ్రాడ్‌బ్యాండ్, డిజిటల్ సేవలు, క్లౌడ్ ఆధారిత అప్లికేషన్లు, ఇండస్ట్రీ ఆటోమేషన్, కనెక్టెడ్ డివైజ్‌లు, స్మార్ట్ సిటీల వంటి రంగాల్లో కూడా 5+ వినియోగం పెరిగే అవకాశం ఉంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రాధాన్యత మరింత పెరగనుంది.

6Gపై భారత్ ఫోకస్..

ఇదే సమయంలో భారత్ ఇప్పటికే తదుపరి తరం టెలికాం టెక్నాలజీ అయిన 6+పై దృష్టి పెట్టింది. ఈ రంగంలో పరిశోధన, పేటెంట్లు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిపై ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేస్తున్నాయని సింధియా తెలిపారు. భారత్‌కు చెందిన 6G అలయన్స్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న సుమారు 90 సంస్థలు ఈ రంగంలో పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు. ఇప్పటివరకు 7,700 పేటెంట్లు స్థాపించినట్లు తెలిపారు. వీటిలో సుమారు 4,400 పేటెంట్లు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయని వెల్లడించారు. 6Gలో భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఇది ముఖ్యమైన అడుగుగా ప్రభుత్వం చూస్తోంది.

4G నుంచి 5G.. ఇప్పుడు 6G

భారత్ టెలికాం రంగంలో సాధించిన పురోగతిని వివరిస్తూ సింధియా కీలక వ్యాఖ్యలు చేశారు. 4+ టెక్నాలజీ విషయంలో భారత్ ప్రపంచంలోని ఇతర దేశాల కంటే వెనుకబడి ఉందని, అయితే 5+లో ప్రపంచంతో కలిసి ముందుకు సాగిందని ఆయన చెప్పారు. ఇప్పుడు 6G విషయంలో మాత్రం పరిస్థితిని మార్చాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని సింధియా స్పష్టం చేశారు. "4Gలో ప్రపంచం కంటే వెనుకబడి ఉన్నాం. 5Gలో ప్రపంచంతో కలిసి నడిచాం. 6Gలో ప్రపంచాన్ని నడిపించాలనేది మా సంకల్పం" అని ఆయన పేర్కొన్నారు.6G సాంకేతికత ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నప్పటికీ, భారత్ ముందుగానే పరిశోధన, పేటెంట్లు, ప్రమాణాలు, టెక్నాలజీ అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా భవిష్యత్ టెలికాం మార్కెట్‌లో కీలక పాత్ర పోషించాలని చూస్తోంది. 2030 నాటికి 5G వినియోగాన్ని ఒక బిలియన్ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు, అదే సమయంలో 6G టెక్నాలజీలో అంతర్జాతీయంగా నాయకత్వ స్థానాన్ని సాధించడమే భారత్ దీర్ఘకాలిక లక్ష్యంగా కనిపిస్తోంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140